


## మంచిర్యాల కార్పొరేషన్ పై ఎగిరేది గులాబీ జెండాయే

- ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన
- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుతోనే నగరాభివృద్ధి: విజిత్ కుమార్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో మెజారిటీ స్థానాలను గెలుచుకొని, కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని ఆయన వివరించారు.

**అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్**

మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమని విజిత్ కుమార్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు హయాంలోనే నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. జిల్లా కేంద్రం ఏర్పాటు, నస్పూర్ మండలం, కలెక్టరేట్ భవన నిర్మాణం వంటివన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి కారుణ్య నియామకాలను పునరుద్ధరించి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపారని కొనియాడారు.

**సింగరేణి సమస్యల పరిష్కారంలో విఫలం..**

టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కనీసం సరైన మందులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో సింగరేణి సంస్థ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి పరిరక్షణ టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని, కార్మికులకు అనేక హక్కులు సాధించిన చరిత్ర తమ సంఘానికి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అక్కూరి సుబ్బయ్య, మెరుగు పవన్ కుమార్, వంగ తిరుపతి, బండి రమేష్, జక్కుల రాజేశం, పానుగంటి సత్తయ్య, గుంట జగ్గయ్య, ముక్కెర వెంకటేశం, అన్వేష్ రెడ్డి, పొగాకు రమేష్, తిప్పని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదు వేగవంతం చేయాలి

- 3 రోజుల్లో ప్రక్రియ పూర్తి కావాలి:
- ఎస్సీ అభివృద్ధి శాఖ ఏఎస్‌డబ్ల్యూఓ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల ప్రక్రియను మూడు రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వసతి గృహ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ అనుసంధాన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వసతి గృహాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సహాయ సంక్షేమ అధికారులు ప్రశాంత్, ధర్మానంద్ గౌడ్ పాల్గొన్నారు.

## నేటి నుండి నియోజకవర్గ స్థాయి సీఎం కప్ పోటీలు

- సకాలంలో హాజరుకావాలని క్రీడాకారులకు డీవైఎస్ఓ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

సీఎం కప్2025లో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లాలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన చెన్నూరులోని మినీ క్రీడా మైదానం, బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని తాళ్లగురజాల టీజీఆర్జేసీలో పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అలాగే 7వ తేదీన మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్ బాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, కరాటే విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తమ రిజిస్ట్రేషన్ స్లిప్, అసలు ఆధార్ కార్డుతో నిర్ణీత సమయానికి మైదానానికి చేరుకోవాలని సూచించారు. ఆలస్యంగా వచ్చిన క్రీడాకారులకు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

## అభివృద్ధి చూసి అభ్యర్థులను ఎంచుకోండి



- నమ్మి మోసపోతే మళ్లీ గోసపడక తప్పదు
- మున్సిపల్‌పై బీఆర్ఎస్ జెండా ఎగురురాలే
- మా అభ్యర్థులను ఆశీర్వదించి ఆదరించాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**శెనార్తి మీడియా, మంథని :**

గత ప్రభుత్వహయాంలో మంథని అభివృద్ధిని చూసి మరింత అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని పవర్ హౌస్ కాలనీ, చైతన్యపురి కాలనీ, శ్రీరామ కాలనీ లో ఆయన అభ్యర్థులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు.పదేళ్ల క్రితం మంథని పట్టణం ఎంత వెనుకబాటులో ఉండేదో, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఎమ్మెల్యేగా పట్టణ అభివృద్ధికి చేసిన కృషిని గమనించాలని అన్నారు. పట్టణ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశామని, అలాగే మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, మున్సిపల్ చైర్ పర్సన్‌గా పుట్ట శైలజ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు, అబద్ధాలను నమ్మి ఓట్లు వేస్తే రెండేళ్లుగా గోసపడుతున్నామని, మళ్లీ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే కన్నీళ్లు తప్ప ఏమీ ఉండదన్నారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమం, సమస్యల పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించి ఆశీర్వదించాలని, పేద బడుగు బలహీనవర్గాల కోసం తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టణ ప్రజలకు జరిగిన మేలు ఏంటో ఆలోచించి ఓట్లు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 60 డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- అభివృద్ధి, సంక్షేమంలో మంచిర్యాలను అగ్రపథాన నిలుపుతాం
- నస్పూర్ ఎన్నికల సభలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ధీమా

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మంచిర్యాలను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని ఆయన హామీ ఇచ్చారు. గురువారం నస్పూర్ పట్టణంలో నిర్వహించిన ఎన్నికల సభకు ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు.



**- అభివృద్ధికి అంకితం..**

నియోజకవర్గ అభివృద్ధికి చివరి శ్వాస వరకు పాటు పడతానని ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. నస్పూర్ పట్టణాన్ని జిల్లా కేంద్రానికి సమానంగా తీర్చిదిద్దుతామని, సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు అందజేస్తామని చెప్పారు. లక్ష్మీ టాకీస్ నుంచి నస్పూర్ మీదుగా కొత్త రోడ్డు వరకు బైపాస్ నిర్మిస్తామని వెల్లడించారు. స్థానిక యువతకు ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అనారోగ్యంతో ఉన్నా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు వివరించారు. రిటైర్డ్ సింగరేణి కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయించామని, కరకట్ట, ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని గుర్తు చేశారు.

**- బీజేపీ, బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు...**

ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ మాట్లాడుతూ.. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనను చూసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 60 స్థానాల్లో విజయం సాధించి మంచిర్యాల కాంగ్రెస్ అడ్డా అని నిరూపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను విక్రయిస్తోందని ఆరోపించారు. అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల భారత రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులు, సామాన్యులకు రక్షణ కవచమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఐఎన్టీయూసీ నాయకుడు జెట్టి శంకర్ రావు, కార్పొరేటర్ అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.

## 33వ డివిజన్ అభివృద్ధే నా లక్ష్యం



- బీఆర్ఎస్ అభ్యర్థి మెరుగు పవన్ కుమార్ హామీ
- విజిత్ కుమార్ ఆధ్వర్యంలో జోరుగా ఇంటింటా ప్రచారం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 33వ డివిజన్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని బీఆర్ఎస్ అభ్యర్థి మెరుగు పవన్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని గాంధీ నగర్, రెడ్డి వాడ, యాదవ నగర్, శ్రీ కృష్ణ నగర్, మేకల మార్కెట్ ఏరియాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ తో కలిసి ఆయన గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

**మౌలిక సదుపాయాల కల్పనకు కృషి**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల నిర్మాణాన్ని ప్రస్తుత పాలకులు వదిలిపెట్టారని విమర్శించారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే, ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేస్తానని పవన్ కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగ తిరుపతి, అన్నపూర్ణ, నరేందర్ రెడ్డి, సాయి కుమార్, మెరుగు రమేష్, జీవన్, రఘువర్ధన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

- ఓటర్లకు భరోసా కల్పించిన సీపీ అంబర్ కిషోర్ ఝా
- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే కఠిన చర్యలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా మంచిర్యాల పట్టణంలో పర్యటించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 59, 60 డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డీసీపీ ఎగ్గడి భాస్కర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రాల పరిసరాలను సమీక్షించి, భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ప్రజలు ఎటువంటి భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల వేళ ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పట్టణ సీఐ ప్రమోద్ రావు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు




## ఒలంపియాడ్ టాపర్‌గా సుహాన్

**శెనార్తి మీడియా, శంకరపట్నం/ కరీంనగర్:**

సుచిరిండియా నిర్వహించిన 'సర్ సి.వి.రామన్ యంగ్ జీనియస్ ఒలంపియాడ్'లో అంతం సుహాన్ రెడ్డి టాపర్‌గా నిలిచాడు. ఆరు రాష్ట్రాల్లోని 1 నుండి 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు లక్ష మంది పాల్గొన్నారు. ఇందులో 8వ తరగతి విభాగంలో సుహాన్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచాడు. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంతం లింగారెడ్డి, మాధవి దంపతుల కుమారుడైన సుహాన్, ప్రస్తుతం కరీంనగర్ పారామితా పాఠశాలలో చదువుతున్నాడు. చిన్నప్పటి నుండి చదువులో రాణిస్తున్న సుహాన్, జాతీయ స్థాయి ఒలంపియాడ్‌లో తన సత్తా చాటాడు. ఈ నెల 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, సినీ నటులు శ్రీకాంత్, శివాజీ రాజా చేతుల మీదుగా సుహాన్ జ్ఞాపికను అందుకున్నాడు. ఈ సందర్భంగా పారామితా పాఠశాలల చైర్మన్ ఇ.ప్రసాదరావు, అంతం తిరుపతి రెడ్డి, అంతం శ్రీనివాస్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ ఎ. సత్యనారాయణ రెడ్డి, పోస్ట్ మాస్టర్ ఎ. కృష్ణారెడ్డి తదితరులు సుహాన్ రెడ్డిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ అందజేత



**శెనార్తిమీడియా, గంగాధర :**

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కురిక్యాల జడ్పీ హెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ కడారి రేణుక కనకయ్య గురువారం పెన్నులు, ప్యాడ్స్ అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రజిత శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్స్ జవ్వాజి మహేందర్, మల్యాల అనిల్, అవుదుర్తి మహేందర్, సెక్రెటరీ జ్యోతి, టీచర్స్ పాల్గొన్నారు.

## 10న మత్స్యగిరింద్ర స్వామి హుండీ లెక్కింపు

- కొత్తగట్టు ఆలయంలో ఏర్పాట్లు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కొత్తగట్టు మత్స్యగిరింద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 10న చేపట్టనున్నట్లు ఈఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉదయం నుండి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ బహిరంగ లెక్కింపు కార్యక్రమంలో మండల అధికారులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొనాలని కోరారు.



# బీజేపీ కార్యాలయంలో టికెట్ల రచ్చ

- పెద్దపల్లిలో తీవ్ర రసాభాస

**శెనార్తి మీడియా, పెద్దపల్లి**

పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో టికెట్ల అంశం తీవ్ర రసాభాసకు దారి తీసింది. 13వ వార్డు టికెట్ కేటాయింపుపై అసంతృప్తితో పార్టీ కార్యకర్తలు, నాయకులు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థికి కాకుండా వేరే వ్యక్తికి టికెట్ కేటాయించారని ఆరోపిస్తూ మున్సిపల్ ఇంచార్జిగా వచ్చిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమిత ఎదుటే కార్యకర్తలు నిరసనకు దిగారు.



ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు పిట్ట వినయ్‌తో పాటు పలువురు కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ అమ్ముకున్నారంటూ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్‌ను కార్యకర్తలు నిలదీశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశం మాటల యుద్ధంగా మారడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. టికెట్ కేటాయింపులో న్యాయం జరగలేదని, పార్టీ కోసం కష్టపడిన నాయకులను పక్కన పెట్టారని కార్యకర్తలు మండిపడ్డారు. కార్యకర్తల ఆగ్రహం పెరగడంతో మున్సిపల్ ఇంచార్జి పరిమిత సమావేశం మధ్యలోనే వెళ్లిపోవాల్సి వచ్చింది. దీంతో సమావేశం పూర్తిగా రసాభాసగా ముగిసింది. టికెట్ వివాదం బీజేపీలో చిచ్చు పెట్టిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.





## గన్నేరువరం సీనియర్ జర్నలిస్టు అకాల మరణం

**శెనార్తి మీడియా, గన్నేరువరం:** మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు విభూతి వీరకుమార్ (53) అనారోగ్య సమస్యలతో గురువారం తెల్లవారుజామున అకాల మరణం చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి బెజ్జంకి మండలం, గన్నేరువరం మండలాలకు జర్నలిస్టుగా విధులు నిర్వహించిన వీర కుమార్ ఆంధ్రప్రభ, సూర్య, ప్రజాశక్తి, ఆంధ్రభూమి తదితర పత్రికల్లో పని చేసి మంచి గుర్తింపు పొందారు. గ్రామంలో రేషన్ డీలర్‌గా కూడా సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీర కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని చీమలకుంటపల్లి గ్రామ సర్పంచ్ జంగిటి ప్రకాష్, గన్నేరువరం టీయూడబ్ల్యూజే ఐజేయు మండల అధ్యక్షుడు మాదరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బుర్ర రాజ్ కోటి గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, మండల మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తెల్ల రవీందర్, జిల్లా ఈసీ మెంబర్ బూర తిరుపతి, సభ్యులు బూట్ల శ్రీనివాస్, బుర్ర కోటేశ్వర్ గౌడ్, తుమ్మ సతీష్, ఇనుకొండ లక్ష్మణ్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు బోడ ప్రతాప్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చోక్కల శ్రీశైలం, కుసుంబా అంజయ్య ప్రగాఢ సానుభూతి తెలిపారు.